RNI NO:APTEL/2018/76747

# నవతరం

తెలుగు దినపత్రిక

NAVATARAM TELUGU DAILY
ఎడిటర్: శిరిగిరి వరదరాజు

పబ్లిష్: రాజమహేంద్రవరం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, వెస్ట్ గోదావరి సంపుటి:11 సంచిక: 39 బుధవారం, 18-02-2026 పేజీలు:4 వెల:1.00

## విశాఖలో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం

### గవర్నర్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**నవతరం, విశాఖపట్నం**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేటి సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. నగరంలోని ఐఎన్ఎస్ డేగా నౌకాదళ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆమెకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సాదరంగా స్వాగతం పలికారు. ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాస్, ఉన్నతాధికారులు కూడా రాష్ట్రపతిని ఆహ్వానించిన వారిలో ఉన్నారు. మంగళవారం (ఫిబ్రవరి 18) విశాఖ తీరంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026'కు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా ఆమె ఈ సమీక్షను పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో భారత నౌకాదళంతో పాటు పలు విదేశీ యుద్ధనౌకలు కూడా పాల్గొంటాయి. ఈ పర్యటనలో భాగంగా, ఫిబ్రవరి 19న జరిగే 'మిలన్ అంతర్జాతీయ సిటీ పరేడ్', 20న నిర్వహించే 'కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాల్లో కూడా రాష్ట్రపతి పాల్గొంటారు. ఆమె పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో పోలీసులు, నౌకాదళ అధికారులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్, భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు, మిత్రదేశాలతో సంబంధాలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.



అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారుతున్న

## ఉత్తర నియోజకవర్గం.....!

### అక్రమ నిర్మాణాలు నా కన్ను సన్నలలో మాత్రమే జరగాలని శాసిస్తున్న ఒక ప్రముఖ ఛానల్

*నవతరం, విశాఖపట్నం:*

*అక్రమ నిర్మాణాల్లో ఉత్తర నియోజకవర్గంలో ప్రముఖ ఛానల్ స్ట్రింగర్‌దే హవా....! 53వ వార్డు లో నేను చెప్పిందే వేదం..! అదికారులపేర్లు చెప్పి బెదిరింపులు.....! 296ప్లానింగ్ సెక్రటరీ యాసిన్‌తో ములాకత్....! యాసీన్ దందా..!..అక్రమ నిర్మాణదారులకు అండ..! ప్లానింగ్ అధికారులకు సవాల్ విసురుతున్న యాసీన్....! ఎవరు ఈ యాసీన్ ..! అక్రమ నిర్మాణాల్లో ఈయన పేరు ఎందుకు మారుమోగుతోంది.....!.. ఇంతలా బరితెగించి అక్రమ కట్టడాలకు అదేచ్ఛగా ఇస్తారాజ్యముగా ఏక చక్రము తిప్పుతున్న యాసిన్ అదేమిటి.....! దీని వెనుకనున్న పెద్దలు ఎవరు.....! మొన్న ఎఫ్.సి.ఐ గోడౌన్ వద్ద గెడ్డ వాగు కబ్జా చేసి నిర్మాణంలో ప్రధాన సూత్రధారి... నేడు హుస్సేన్ నగర్లో మరో అక్రమ నిర్మాణానికి పాత్రధారి....! ఏసీపీ తిరుపతిరావు, టిపిఓ ప్రవీణ్ సహకారంతోనే ఈ తతంగమంతా నడుస్తుందని స్థానికుల ఆరోపణలు....!.. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో ముందుకు సాగవలసిందే... పూర్తి వివరాలు త్వరలో...*

## ఎమ్మెల్యేలను రీకాల్ చేయాలి: స్పీకర్



అమరావతి: స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరోసారి ఎమ్మెల్యేల గైర్హాజరుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి హాజరుకాకుండా జీతాలు తీసుకునే ఎమ్మెల్యేలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా అటువంటి వారిని రీకాల్ చేయాలంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ప్రారంభమైన తర్వాత కాసేపు సాంకేతిక సమస్య రావడంతో లాబీల్లో మీడియాతో స్పీకర్ చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరును పరోక్షంగా ప్రస్తావిస్తూ స్పీకర్ విమర్శలు చేశారు. గత బడ్జెట్ సమావేశాల నుంచి స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడకు వెళ్లినా, ఏ సమావేశమైనా సరే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకుంటున్నారనే అంశాన్ని హైలెట్ చేస్తున్నారు. అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలను రీకాల్ చేసే పద్ధతి ఉండాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు బలంగా కోరుకుంటున్నారు. ఆయన ప్రతిపాదనలో రాజకీయమే ఎక్కువగా ఉన్నప్పటికీ పదేపదే ఆయన చేస్తున్న వాదనపై విస్తృత చర్చ జరుగుతోంది. అసెంబ్లీలో ఏఐ అటెండెన్స్ ప్రవేశపెట్టిన తర్వాత సభ్యుల హాజరు బాగుందని స్పీకర్ వెల్లడించారు. సభ్యులు సభలో ఎంత సేపు ఉన్నది? ఎప్పుడు వచ్చింది? ఎప్పుడు వెళుతుందీ స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇదే సమయంలో విపక్ష ఎమ్మెల్యేల తీరుపై స్పీకర్ పరోక్ష విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సభకు రాని ఎమ్మెల్యేలను రీకాల్ చేసే చట్టం ఉండాలని అభిప్రాయపడ్డారు. "శాసనసభకు హాజరు కావడం ఎమ్మెల్యేల విధి. సభకు రాకుండా జీతాలు తీసుకోవడం తగదు. వారి జీతం కట్ చేయాలి." అంటూ వైసీపీ సభ్యులను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు స్పీకర్. ఉద్యోగులు విధులకు హాజరుకాకపోతే జీతాలు కట్ చేసే నిబంధనలు ఉన్నప్పుడు, ఆ నిబంధనలు ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించకూడదని స్పీకర్ ప్రశ్నించారు. ప్రపంచంలోని 8 దేశాల్లో చట్టసభ సభ్యులను రీకాల్ చేసే పద్ధతి ఉందని, మన దేశంలో అలాంటి వ్యవస్థ లేదని విచారం వ్యక్తం చేశారు. తరచూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేస్తున్న ఈ తరహా వ్యాఖ్యలు విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ఆయన ఎక్కడకు వెళ్లినా వేదిక ఏదైనా ఇదే అంశాన్ని చర్చిస్తున్నారు. గత నెలలో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన స్పీకర్ల సదస్సులో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. 'నో వర్క్.. నో పే' విధానాన్ని ప్రవేశపెట్టాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా దృష్టికి తెచ్చారు. గత ఏడాది బడ్జెట్ సమావేశాల నుంచి స్పీకర్ ఇదే విధంగా మాట్లాడుతున్నారని గుర్తు చేస్తున్నారు. మన దేశ చట్టాల ప్రకారం ఎమ్మెల్యే హాజరు, జీతాల కోతపై సరైన నిబంధనలు లేవని తెలిసినా, ఆయన పదే పదే అవే వ్యాఖ్యలు చేయడం చూస్తుంటే విపక్ష వైసీపీని ఇరుకన పెట్టడం, నైతికంగా ఇబ్బంది పెట్టడమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోందని అంటున్నారు.

## ప్రజా సమస్యలపై చర్చించే ఉద్దేశం వైసీపీకి లేదు: జనసేన ఎమ్మెల్యేల విమర్శలు

అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ జరగకుండా ఉండేందుకే వైసీపీ శాసనమండలిలో ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టిస్తోందని జనసేన ఎమ్మెల్యేలు తీవ్రంగా ఆరోపించారు. తమ పార్టీ ఎమ్మెల్సీలతో మండలిలో రభస చేయించి, చైర్మన్ పోడియం ఎక్కించి మరీ సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తూ వైసీపీ అధినేత జగన్ ఇంట్లో కూర్చొని నవ్వుకుంటూ వికృతానందం పొందుతున్నారని వారు విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని, అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపించేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. పోలవరం, అమరావతి వంటి ప్రాజెక్టులకు, బీసీ వర్గాలకు రూ.50 వేల కోట్లకు పైగా కేటాయింపులు చేయడం చారిత్రాత్మకం. ఇంతటి కీలకమైన బడ్జెట్‌పై చర్చించే ఓపిక, ధైర్యం లేక వైసీపీ తన సంఖ్యా బలంతో మండలిలో గొడవకు దిగింది. జగన్‌కు గొడవ, గోల లేకపోతే నిద్ర పట్టదు. అందుకే విలువైన సభా సమయాన్ని వృథా చేస్తున్నారు" అని మండిపడ్డారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. "అసెంబ్లీకి రాని వారు, మండలిలో సమయం ఉన్నా చర్చించకుండా పక్కదారి పట్టిస్తున్నారు. వారికి ప్రజా సమస్యలు పట్టవు, కేవలం రభస చేయడమే కావాలి. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సమగ్ర బడ్జెట్ రూపొందిస్తే, దానిపై మాట్లాడలేక సభలో రచ్చ చేస్తున్నారు. చైర్మన్ పోడియం ఎక్కిన వైసీపీ సభ్యుల అప్రజాస్వామిక తీరును జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది" అని స్పష్టం చేశారు.

## అనకాపల్లి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం..

**నవతరం, అనకాపల్లి**

అనకాపల్లి జిల్లాలోని పారిశ్రామిక కేంద్రమైన అచ్యుతాపురం జంక్షన్ సమీపంలోని కేఆర్ మార్ట్‌లో ఇవాళ (మంగళవారం) భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. మార్ట్ లోపల అకస్మాత్తుగా మంటలు చెలరేగడాన్ని గమనించిన సిబ్బంది, వినియోగదారులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. మంటలను ఆర్పివేస్తున్నారు. పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. మార్ట్‌లోని వస్తువుల్లో ప్లాస్టిక్ సామగ్రి ఉండటంతో మంటలు క్షణాల్లో ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పొగలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించడంతో స్థానికులను అప్రమత్తం చేశారు.



**నష్ట నివారణ..**

ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మార్ట్‌లోని వస్తువులన్నీ కాలి బూడిదవ్వడంతో లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లి ఉండవచ్చని యాజమాన్యం అంచనా వేస్తోంది. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది ఇంకా మంటలను పూర్తిగా అదుపు చేస్తున్నారు.

## వైసీపీ నేతల్లారా... సిగ్గుపడండి!

### మండలిలో అచ్చెన్నాయుడు ఫైర్

అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ నేతలపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. లడ్డూలో కల్తీ జరిగిందని నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డే స్వయంగా ఒప్పు కున్నాక కూడా, వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. "తప్పు ఒప్పుకున్నాక కూడా బుకాయిస్తారా? వైసీపీ నేతల్లారా సిగ్గుపడండి" అని అచ్చె న్నాయుడు వ్యాఖ్యానించారు. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి, పవిత్ర ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీకి ధర్మం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో జగన్ తిరుమల పర్యటనను మంత్రి గుర్తుచేశారు. హిందూ సంప్రదాయాల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వడానికి జగన్ ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు. అంతేకాకుండా హెరిటేజ్ సంస్థపై అడ్డగోలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, దమ్ముంటే కనీసం ఒక్క ఆధారమైనా చూపాలని వైసీపీకి సవాల్ విసిరారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించి, హిందూ ధర్మంపై దాడులకు పాల్పడిన ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సత్యం గెలిచి తీరుతుందని, తప్పుచేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని ఆయన స్పష్టం చేశారు.



## అధికారుల తీరుపై రేవంత్ అసంతృప్తి..



హైదరాబాద్: తెలంగాణలో పురపాలక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో ఈరోజు నిర్వహించిన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచి ఫీల్డ్‌లో ఉండాలి. పారిశుద్ధ్యం, రోడ్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడిక్కడే అధికారులను సస్పెండ్ చేస్తాను" అని హెచ్చరించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అధికారులకు కీలక సూచనలు చేశారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట్ల పీపీపీ విధానంలో స్కైవాక్ బ్రిడ్జిలు నిర్మించాలని చెప్పారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు.

# సూపర్ సిక్స్ అమలు చేయలేని బడ్జెట్

## గారడీ లెక్కలు.. అప్పుల ప్రణాళికలే

### వైఎస్ఆర్సిపి మందస మండలం సీనియర్ నేత మద్ది బాలకృష్ణ యాదవ్

**నవతరం, మందస**

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడో విడత బడ్జెట్లో సంక్షేమ పథకాలు లేవని, సంక్షోభం మాత్రమే కనిపిస్తుందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన సూపర్ సిక్స్ పథకాలతో పాటు మరో 136 హామీలకు అతిగతి లేదని వైయస్సార్సీపి మందస మండల సీనియర్ నేత మద్దిలి బాలకృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మందస మండలం హరిపురంలో మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, చెబుతున్న అబద్ధాలు ఈ వార్షిక బడ్జెట్లో కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని బాలకృష్ణ యాదవ్ విమర్శించారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఊసే లేదని, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీలకు పింఛన్లు ఇస్తామని దానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసి డీబీటీ ద్వారా ప్రజల ఖాతాలకు నగదు జమ చేస్తుంటే.. వైయస్ జగన్ ఆర్థిక విధ్వంసం చేస్తున్నారని నాడు కూటమి పార్టీలు విమర్శలు చేశారని, ఇప్పుడు సంక్షేమ పథకాలు లేవు.. అభివృద్ధి కార్యక్రమాలు లేవు.. అయితే మాత్రం రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా కూటమి సర్కార్ మార్చి వేసిందని బాలకృష్ణ యాదవ్ ఆరోపించారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో ఓడరేవులు, నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఆధునికరణ, ఆసుపత్రులు అభివృద్ధి, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లు నెలకొల్పడం జరిగిందని, ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, రూ.3.18 లక్షల కోట్లే అప్పులు అయ్యాయి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏ పథకాలు అమలు చేయకపోయినా రెండు సంవత్సరాలు కాకముందే రూ.3.27 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. సంపద



సృష్టిస్తానని చెప్పిన పెద్దమనిషి ఇప్పుడు అప్పులు సృష్టిస్తున్నా రని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర బడ్జెట్లో అంకెల గారడీ, మాటల బురిడీ తప్ప ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు పాతర వేసినట్లేనని, అన్నదాత సుఖీభవ పథకానికి రైతుకు రూ.20,000 చొప్పున ఇవ్వాలంటే బడ్జెట్ కేటాయింపులో సంవత్సరానికి రూ.10,700 కోట్లు కావాలని, అయితే కేటాయించిన నిధులు కేవలం రూ. 6000 కోట్లేనని, సున్నా వడ్డీ కింద రుణాలు, పంటలకు ఉచిత బీమా కేటాయింపులు లేనే లేవన్నారు. అన్నదాతలను పూర్తిస్థాయిలో విస్మరించారని, చివరకు ధరల స్థిరికరణ కింద రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారని ఆయన విమర్శించారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ధరల స్థిరీకరణ కింద రూ. 7,800 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందించడంలో వైఫల్యం చెంది ప్రజావ్యతిరేక విధానాలు అనుసరి స్తుందని, ఇలా అంకెల గారడీతో ప్రజలకు మోసం చేయడం తప్ప,ప్రజలకు మేలు చేసే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేయలేదన్నారు. ప్రధానంగా వెనుకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతాన్ని పూర్తిగా బడ్జెట్లో కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉద్దానం ప్రాంతంలో వలసలు నివారించాలంటే, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు తోపాటు పర్యావరణానికి హానిలేని ఇండస్ట్రియల్ పార్క్ నెలకొల్పాలని, ముఖ్యంగా ఉద్దానం ప్రాంత ప్రజల ఆకాంక్ష పలాస జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే, మిగతా జిల్లాల తోపాటు సమానంగా సమగ్ర అభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయని బాలకృష్ణ యాదవ్ అభిప్రాయపడ్డారు. బడ్జెట్లో సవరణ చేసి ఉద్దానం ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, అందుకు స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు చట్టసభల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అనుకున్న డిమాండ్ల సాధనకు కృషి చేయాలని ఆయన కోరారు.



# నాటక కళాబంధం

**నవతరం, విజయవాడ**

"చెల్లియో చెల్లకో తమకు చేసిన యెగ్గులు సైచి రందరున్‌తో ప్రారంభించి "సంతోషంబున సంధి చేయ" పద్యం వరకూ షణ్ముఖ ఆంజనేయులు "శ్రీకృష్ణ రాయభారం"లోని వీడియో వినగానే చెవుల తప్పు వదిలింది. ఇటీవల ఆ వీడియో ఎవరో పంపారు. అది వినగానే మా కుటుంబం నాటకాల పర్వం గుర్తుకు వచ్చింది. నాటక కళ పట్ల మా కుటుంబానికి ఉన్న ప్రీతి, అభిమానం, పిచ్చి వల్ల అనేక నాటక ప్రదర్శనలు వేయించాం. గుడివాడ, తెనాలిలలో నాటకానికి చెందిన దుస్తుల,మేకప్ ఆర్టిస్టులు ఉండేవారు. వారు కృష్ణా, గుంటూరు జిల్లాలలో వేసే పౌరాణిక నాటకాలకు సప్లై చేసేవారు. ఆరోజుల్లో నాటక కళకు ప్రేక్షకుల ఆదరణఉండేది. మా ఊరులో ఉన్నప్పుడు,మాచిన్నప్పుడు తాత, నాన్న వేయించిన నాటకాలు మదిలో గిర్రున తిరిగాయి. మా ఊరిలో చదువురాని కుర్రాళ్లతో మాతాత మాజేటి రామ చంద్రరావు "పల్లెపడుచు" సాంఘిక నాటకం 60 దశకంలో వేయించారు. దానికి ఆయన ఆరు నెలలు వాళ్లతో కష్టపడి అక్షరం తప్పులేకుండా పలికేలా తర్ఫీదు ఇచ్చారు. ఆయనకు నాటకాలంటే ప్రాణం. అందుకే తన ఇంట్లో పెద్ద డ్రామా హాల్ కట్టించి అనేక నాటకాలు వేయించి తాను వేసేవారు. హార్మో నియం, ఇతర సంగీత పరికరాలు పెట్టుకునేందుకు అప్పట్లోనే సిమెంటు చప్టా, స్టేజీ కట్టించారు. ఆ హాలులో చాలా నాటకాలు వేసేవారు. ఆ నాటకాల్లో లక్ష్మీపురం ప్రసాద్ బాబాయి, కామేశ్వరరావు బాబాయి కూడా వేసేవారు. ఒకసారి మా హాల్లో టిక్కెట్ నాటకం వేస్తున్నారు. తాతయ్య అంటే ఊరి జనానికి భయం ఉండేది. గేటు దగ్గర కొంతమంది లోపలికి ఫ్రీగా పంపమని గొడవ చేసారు. మా తాతయ్య ఒక్క అరుపు అరవగానే అందరూ తోక ముడిచి పారిపోవడం నాకు బాగా గుర్తు. నేను ఏడోతరగతి చదువుతున్నప్పుడు గుడివాడలో సినీ నటుడు "ధూళిపాళ" దుర్యోధనుడిగా నటించిన "శ్రీకృష్ణ రాయభారం" నాటకం మా నాన్నతో వెళ్లాను. విజయవాడలో 1974లో మా అన్న సుబ్బారావు వర్ధంతి సందర్భంగా ఇప్పటి సిద్ధార్థ నగర్ మూడో సందులో వేయించారు. దానిలో మానాన్న మోహనరావు, మా మావయ్య పరమేశ్వరరావు దుర్యోధనుని పాత్రలో నటించారు. ఆ తరువాత 78 నుంచి మా ఊరు మాజేరులో ప్రతి ఏడాది ఆంజనేయ స్వామి గుడి వెనుక ఇంటి వద్ద ప్రతి ఏడాది అన్న వర్ధంతి రోజు నాటకాలు వేసేవారు. ఎక్కువగా "శ్రీకృష్ణ ఉద్యోగ విజయాలు" నాటకం వేసేవారు. శ్రీకృష్ణ పాత్రకు 100 పద్యాలు ఉండేవి. అందుకే ఇద్దరు, ముగ్గురు ఆ వేషం వేసేవారు. మా చిన్న తాతయ్య బొడ్డపాటి విశ్వేశ్వరరావు ధర్మరాజు, మా మేనల్లుడు సాయి ప్రసాద్ వికర్ణుడి వేషం వేసేవారు. ఒక ఏడాది సత్యహరిశ్చంద్ర వేయించారు. నక్షత్రకుడి పాత్ర వూటుకూరి ప్రసాద్ వేసారు. ఆయన పాడిన పద్యాలు ఇప్పటికీ చెవుల్లో మారుమోగుతున్నాయి. ఆయన పుష్పరాజ్ శిష్యులు. అలాగే డీవీ సుబ్బారావు కాటిసీన్ గుడివాడలో చూడడం జరిగింది. అలా మానాన్న తాతయ్య వర్ధంతికి కూడా నాటకాలు వేయించేవారు. 1995 వరకూ వేయించారు. మా అన్నయ్య సుబ్బారావు 1969, 70లలో "మంచిరోజులు" సాంఘిక నాటకం రెండు సార్లు వేసారు. నేను 1970లో టెన్త్ పూర్తయిన తరువాత మా చిన్న తాతయ్య ఇంటికి కత్తిపూడి వెళ్లాను. అక్కడ దగ్గరలోని అన్నవరం ఉత్సవాలకు వెళ్లేవాడిని. రోజూ ఒక నాటకం వేసేవారు. గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం చూసి వచ్చేవారం. 1982 లో నేను కూడా "రామరాజ్యంలో రక్తపాతం" సాంఘిక నాటకం మా ఊరిలో స్నేహితులతో వేసాను.బందరు శ్రీరామ నవమి పందిరిలో కూడా ఒక నాటకం వేసాను. మా పక్క ఊరిలో వేసిన "చింతామణి" కళ్లేపల్లి శివరాత్రి ఉత్సవాల్లో "సత్యహరిశ్చంద్ర" నాటకం సైకిల్ మీద వెళ్లి చూసాం. ఆరోజుల్లో నాటకాలంటే పల్లెల్లో బాగా క్రేజ్ ఉండేది. పట్టణాలలో పెద్దపెద్ద పేరున్న కళాకారులతో టిక్కెట్ నాటకాలు వేసేవారు. ప్రేక్షకులు ఎగబడి చూసేవారు. కళాకారులు ముఖ్యంగా పద్యం చివర చేసే ఆలాపనా రాగం ప్రేక్షకులను అలరించేది. పద్యం నచ్చితే "వన్స్ మోర్" అని ప్రేక్షకులనుంచి ప్రశంస వస్తే ఆ కళాకారుడి జన్మ ధన్యమయినట్లే.

**యం.వి.రామారావు**

## ఉపాధ్యాయ తిరుగుబాటు తారస్థాయికి చేరింది.....!

**నవతరం, విజయవాడ**



ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఐఆర్, పిఆర్సి మరియు నేటి వరకు ఉన్న డిఏ బకా యిలు అన్నీ కూడా తక్షణమే చెల్లించాలని.....! కూటమి సర్ ఏర్పడి 20 నెలలు గడిచిన నేటి వరకు అమలు జరగకపో వడం అన్యాయమని వారు వాపు అవుతున్నారు....! ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఒక్క టి నెరవేర్చకపోవడం అక్షరాల అన్యాయమని ఆవేదన చెందుతున్నారు....! విజయవా డలో ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం వారు భారీ స్థాయిలో హాజరై ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నరూ. న్యాయం జరిగే వరకూ విడిచి పెట్టేది లేదని ఉద్ఘటించివారి ఐక్యతను చాటు కుంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.....! ఆశిద్దాం తక్షణమే ప్రభుత్వం న్యాయమైన కోర్కెలను హక్కులను కాపాడేందుకు తగు చర్యలు తీసుకుంటుందని..

## మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు

**నవతరం, విశాఖపట్నం**

మార్చి 16 నుంచి పాఠశాలలు ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహణ. 12:30 గంటలకు మధ్యాహ్న భోజనం అందజేత.

**పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలు:**
మధ్యాహ్నం 1:00 నుంచి సాయంత్రం 5:00 వరకు నిర్వహణ, పరీక్షలున్నంతకాలం 10వ తరగతి స్పెషల్ క్లాసులు.

**వేసవి సెలవులు:**
ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు, జూన్ 12 నుంచి 2026-27 కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం.

**రంజాన్ ప్రత్యేక వెసులుబాటు:**
ఉర్దూ మీడియం పాఠశాలలు & డైట్ కళాశాలలు ఫిబ్రవరి 19 నుంచి మార్చి 20 వరకు, ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు, మార్చి 20 తర్వాత అదనపు తరగతులు నిర్వహణ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ వెల్లడించారు.

# పోలయ్య కూకట్లపల్లి కవితా గానం

# రవీంద్ర భారతిలో ఘన సన్మానం



**నవతరం, హైదరాబాద్**

సర్వజన సాహితీ సామాజిక సంస్థ తెలంగాణ ఆధ్వర్యంలో అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ రషీద్.. కార్యదర్శి మోటూరి నారాయణరావు సారథ్యంలో మంగళవారం సాయంత్రం ప్రముఖ సైకియాట్రిస్ట్ నారాయణ పేటలో పుట్టిన అమెరికా డాక్టర్ "ముహమ్మద్ ఖుతుబుద్దీన్ గారి "జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఆచార్య పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ పుస్తకావిష్కరణ చేయగా ప్రముఖ కవి రామ చంద్రమౌళి క్లుప్త సౌందర్యంగా పుస్తకాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా దీపక్ న్యాతి... అన్వర్ పాషా... దన్నారం శ్రీనివాస్... సమన్వయ కర్తలుగా నిర్వహించిన కవి సమ్మేళనంలో హైదరాబాద్ అత్తాపూర్ నివాసి ప్రముఖ కవి రచయిత నటుడు పోలయ్య కవి కూకట్లపల్లి పాల్గొని "మందు ఒక్కటే మానవత్వం" కవితను గానం చేస్తూ...

**"అరిషడ్వర్గాలనే**
**అంతర్గత దుర్గుణాలతో**
**మనిషి మలినమైపోతున్నాడు**
**ఆ దుర్గుణాలు అంతరంగాన**
**ఎగిసేపడే ఆరని అగ్నికణాలు...**

**"నేడు**
**ఎటువైపు చూసినా**
**స్వార్థం కులం బలం**
**అహంకారం**
**ఆశ్రిత పక్షపాతాలే**
**రాజ్యమేలుతున్నాయి...**

**"కుట్రలతో కుతంత్రాలతో**
**పగాప్రతీకారాలతో**
**అసూయాద్వేషాలతో...**

**"ధనదాహంతో**
**పదవీ వ్యామోహంతో విర్రవీగుతూ**
**అక్రమాలకు పాల్పడుతూ మనిషి**
**అవినీతి ఊబిలో కూరుకుపోతున్నాడు...**

**"అశాంతితో రగిలిపోతున్నాడు**
**దుష్ట తలంపులతో భ్రష్టుడైపోతున్నాడు...**
**కళ్ళు పొరలు కమ్మి కామంతో**
**మనిషి మృగంలా మారిపోతున్నాడు...**

**"బుద్ధభూమిని యుద్ధభూమిగా మారుస్తూ**
**రాజ్యకాంక్షతో రక్తపుటేరులు పారిస్తూ**
**మనిషి రాక్షసుడై పోతున్నాడు...**

**"అందుకే అశాంతితో**
**మనిషి కుమిలి పోతున్నాడు**
**దానికి "మందు ఒక్కటే మానవత్వం"...**

**ఔను ఓ మానవత్వమా**
**నీవెక్కడంటే.? ఆకలికి అలమటించే**
**అభాగ్యులను అనాథలను ఆనాదుకునే..**

**నిస్వార్థపరులైన ధర్మమూర్తుల**
**దాతృత్వపు గుణంలో... దాగి**
**నేనక్కడంటోంది... మానవత్వం...**

**"ఔను దానవత్వాన్ని దహనం చేస్తే**
**మానవత్వం చిగురించే వసంతమే...**

**"అందుకే యుద్ధవిమానాలతో**
**ఈ ధరణి దద్దరిల్లకుండా**
**ప్రతిచోటా ప్రశాంతత ప్రజ్వరిల్లేలా...**

**"ప్రతి మనిషి మనసునేలలో**
**స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు**
**సమానత్వం సౌభ్రాతృత్వాలకు**




**పునాదులైన దయా జాలి కరుణలనే...**
**మానవత్వపు విత్తనాలను నాటుదాం...**
**ప్రతిగుండెలో ప్రేమపూలను పూయిద్దాం..**
**విశ్వమంతా శాంతికపోతాల్ని ఎగురవేద్దాం**

అంటూ సందేశాత్మక కవితను వినిపించి ప్రముఖులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ సభకు డాక్టర్ విడి రాజగోపాల్... కాంతి కృష్ణ... గౌరీ శంకర్... మౌనశ్రీ మల్లిక్... అంజనీ కుమారి... తదితర సాహితీ మూర్తులు హాజరై డాక్టర్ ముహమ్మద్ ఖుతుబుద్దీన్ ఒక మానవతావాది అని వారి జీవితం నేటి యువతకు రేపటితరాల వారికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. తదనంతరం అతిథులకు కవితా గానం చేసిన కవులను కవయిత్రులకు ఆత్మీయ సత్కారం జరిగింది. డాక్టర్ ముహమ్మద్ ఖుతుబుద్దీన్. డా.వి.డి.రాజగోపాల్ సాధనాల మొహమ్మద్ అబ్దుల్ రషీద్ పోలయ్య కవి కూకట్లపల్లిని అందమైన శాలువాతో... చక్కని జ్ఞాపికతో... విలువైన పుస్తకంతో... ఘనంగా సన్మానించారు... పోలయ్య కవి కూకట్లపల్లి అందరికీ ప్రత్యేకంగా అబ్దుల్ రషీద్ భాయ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు

## పద్మశాలీ కల్యాణ వేదిక నిర్మాణానికై వినతి

**నవతరం, గాజువాక**

గాజువాక నియోజకవర్గ పరిధిలో పద్మశాలీ సామాజిక వర్గానికి కల్యాణ వేదిక నిర్మాణం చేపట్టాలని అందుకు గాను స్థలాన్ని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పప్పు రాజారావు స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు పాత గాజువాక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆర్థిక పరంగా వెనకబడి ఉన్న పద్మశాలీలు ఎటువంటి శుభకార్యాలు తలపెట్టినా ప్రైవేటు కళ్యాణ వేదికలను ఆశ్రయించాల్సి వస్తుంది అని, దీనివలన సామాజికవర్గంపై ఆర్థిక భారం పడుతుంది అని తెలియజేసారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న తమ కులస్తుల అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని కల్యాణ వేదిక నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పప్పు శం కరరావు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో కొండూరు గురువులు

**నవతరం, వజ్రపు కొత్తూరు**

ఇటీవల కాలంలో వజ్రపు కొత్తూరు మండలం కొండూరు గ్రామానికి సంబంధించినటువంటి అడ్డిభవన్ మరియు వాళ్ళ నాన్నమ్మ అడ్డి.తులసమ్మ ఎలక్ట్రికల్ షాక్ తగిలి ఆసుపత్రి పాలైనటువం టి విచారణకరమెనటువంటి సంఘ టన తెలిసిందే. ఈ విషయం తెలుసు కున్నటువంటి కొండూరు ఎం.పీ. యుపి.ఎస్ ఉపాధ్యాయులు బాధి తుల కుటుంబానికి 9000/-రూపాయలు సహాయం అందించారు. ఈ కార్య క్రమంలో కొండూరు ప్రధాన ఉపాధ్యాయు రాలు సిస్టు.కల్పనా దేవి మాట్లాడుతూ అడ్డి.తుల సమ్మ ఒకప్పుడు మిడ్ డే మీల్స్‌లో వంట చేసే వారిని చాలా మంచి మనస్తత్వం కలి గిన వరని ఇలా జరగడం చాలా బాధాకరమైన విషయమని ప్రతి ఒక్కరు కూడా వారికి సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

## లోపాలు లేనివాడు లోకాన లేడు...

అందాల వెలుగుతో
ముత్యంలా మెరిసే ఓ మగువా
అలలను ఆహ్వానించే తీరంలా
చిరునవ్వులు చిందించకు...
చనువు నేడు చల్లని చినుకే
రేపది వరదై ముంచేస్తుంది.
కడలి కెరటాలు
తీరాన్ని తాకితే వినోదమే
తీరం దాటితే తుఫానే
విధ్వంసమే వినాశనమే
ఈ జీవితం కూడా అంతే సుమా...
తిట్టడం తాత్కాలిక గెలుపు,
తాకడం శాశ్వతమైన మార్పు
గునపంలా గుచ్చే పచ్చినిజం
మాయని గాయాల్ని
మిగిలిస్తుంది...
గుట్టుగా పలికిన సత్యం
గుండెల్లో వేర్లు వేస్తుంది
అది అగ్నిలా దహించదు
వెన్నెలై వెలుగు నిస్తుంది...
ఎవరు ఎంతగా చేరువైనా
నీ హద్దే నీకు శ్రీరామరక్ష
ఒక్క అడుగు వేసినా
లక్ష్మణ రేఖను దాటినా
నీ నీడే నీకు శత్రువౌతుంది...
ఆపలేని ఆవేశం ఉండాలి
కాని అది ఆరని దీపం కావాలి
నిజాన్ని నిర్భయంగా చెప్పాలి
కానీ అది మనిషికి నిచ్చెన కావాలి..
జాగ్రత్త అన్నది భయం కాదు
అది జీవితానికి రక్షణ కవచం
ఏ గుండెను కోయని ఓ మంచిమాటే
ప్రతిగుండెను మేల్కొల్పే అఖండ శక్తి...
ఏలోపాలు లేనివాడు ఈలోకాన లేడు...
అందాల చంద్రునిలో సైతం మాయని
మచ్చలుంటాయి ముళ్ళు రాళ్ళు విసరక
చీకట్లో మానవత్వపు దీపాల్ని వెలిగించు.

రచన:
కవి రత్న
సాహిత్య ధీర
**సహస్ర కవి భూషణ్**
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్



ఎమ్మెల్సీ తాళశిలరఘురాం గారి తండ్రి మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి.. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి.

Printed by SIRIGIRI VARADARAJU, and published by SIRIGIRI VARADARAJU, on behalf of SIRIGIRI VARADARAJU, and printed at : Krathi Publications, D.No.18-11-12/1, Krishna Nagar, ward-39, RAJAHMUNDRY, EAST GODAWARI DIST. ANDHRA PRADESH STATE - 533 101, Published at : Kranthi Publications, D.No. : 18-11-12/1, Krishna Nagar Ward-39, RAJAHMUNDRY, EAST GODAWARI DIST, ANDHRA PRADESH STATE - 533101, Editor : SIRIGIRI VARADARAJU, Email: navataramraju@gmail.com, Cell : 9959007255